క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: మల్లయ్యకొండ శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సందర్శించారు. ఆలయ పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున ఆయనకు స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సకాలంలో వర్షాలు పడి రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామిని వేడుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

తంబళ్లపల్లె: శాంతియుతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఈఆర్వో రాఘవేంద్ర గురువారం విలేకరులకు తెలిపారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి చర్యలు చేపట్టామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటరు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లుపూర్తి చేశామన్నారు.

అమ్మవారి లడ్డూ వేలం

మదనపల్లె సిటీ: శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక నీరుగట్టువారిపల్లెలోని ఆలయంలో అమ్మవారి లడ్డూ వేలం వేశారు. అమ్మవారి లడ్డూను రూ.9000 చెల్లించి ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు రామచంద్ర దక్కించుకున్నారు. అనంతరం చీరలు, జ్యోతి నాణేలు వేలం వేశారు.

ఉచిత ఖత్నా సద్వినియోగం చేసుకోండి

పీలేరు రూరల్ : ఈ నెల 25న పీలేరులో, 29న కలికిరి మండలం గడిలో నిర్వహించనున్న ఉచిత ఖత్నా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్ స్టోన్ క్రషర్ అధినేత షేక్ షఫీవుల్లా కోరారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న అక్సా మసీదులో, 29న కలికిరి మండలం గడిలోని ఉర్దూ స్కూల్‌లో పేద ముస్లింలకు ఉచిత ఖత్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9492378754 నెంబరులో సంప్రదించాలన్నారు.

గ్రామ వలంటీర్లు రాజీనామా

పీలేరు రూరల్ : మండలంలోని గూడరేవుపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని 11 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. గురువారం రాజీనామా పత్రాలను సర్పంచ్ దండు జగన్‌మోహన్‌రెడ్డికి అందజేశారు. రాజీనామా చేసినవారిలో డి. లక్ష్మీ, సి. మంజుల, సంతోషనాయక్, మణినాయక్, ఆనంద్‌నాయక్, భాగ్యలక్ష్మీ, మోహన్, చిన్నరెడ్డెమ్మ, కవిత, దొరస్వామినాయక్ ఉన్నారు.

పోలీసుల కవాతు

కలకడ : మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం మిలటరీ బలగాలతో చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై కలకడ తహసీల్దార్ కార్యాలయం నుంచి గుర్రంకొండ రోడ్డు, గుర్రంకొండ రోడ్డు నుంచి పీలేరు రోడ్డు వరకూ ప్రత్యేక కవాతు నిర్వహించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మదనపల్లె సిటీ: శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ పోస్టర్లను స్థానిక వరాల ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈనెల 15న ఉదయం గణపతి పూజతో ప్రారంభిస్తామన్నారు. పందిరి పూజ, పసుపు దంచడం, వధూవరులను చేయుట, 16న సాయంత్రం 5 గంటలకు వరపూజ, ఎదురుకోలు, నిశ్చితార్థం , 17న శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. సాయంత్రం 5 గంటలకు శ్రీరామచంద్రమూర్తి, జానకిల కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు.

ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

నిమ్మనపల్లె : వైఎస్సార్ సీపీ నాయకుడు చిలక రామకృష్ణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్ సీపీ మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొండయ్యగారి పల్లికు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చిలక రామకృష్ణారెడ్డి (60) గుండెపోటుకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న నిసార్ అహ్మద్, దేశాయ్ తిప్పారెడ్డి,నరేష్ కుమార్ రెడ్డి, కొండయ్య గారి పల్లె చేరుకుని రామకృష్ణారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల పరిధిలో గురువారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మత గురువులు రంజాన్ విశిష్టతను తెలియజేశారు. ఆయా ప్రాంతాలలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు దానం చేశారు. రంజాన్ సందర్భంగా బంధు మిత్రులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.



కేవీపల్లె : గర్నిమిట్ట ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మదనపల్లె సిటీ: ధార్మికోపన్యాసం చేస్తున్న జామియా మసీదు ఇమాం మౌలానా జలాలుద్దీన్

మదనపల్లె సిటీ: ఈద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



మదనపల్లె సిటీ: పేదరికం లేని సమాజ నిర్మాణమే రంజాన్ పండుగ ఆశయమని స్థానిక జామియా మసీదు ఇమాం మౌలానా జలాలుద్దీన్ సాహెబ్ పేర్కొన్నారు. మదనపల్లెలో గురువారం ఉదయం ఈద్–ఉల్–ఫితర్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా స్థానిక నక్కలదిన్నెలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా మౌలానా జలాలుద్దీన్ సాహెబ్ ధార్మికోపన్యాసం చేశారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఖబ్రస్థాన్‌లకు వెళ్లి పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు.

ఈద్ ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్

నక్కలదిన్నె ఈద్గా మైదానం, మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ డ్రైవర్స్‌కాలనీలోని ఈద్గాలలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.నిస్సార్ అహ్మద్ పాల్గొన్నారు. అందరికి ఈద్ శుభాకాంక్షలు తెలిపారు.

– డ్రైవర్స్ కాలనీలో ఈద్ ప్రార్థనల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు జింకా వెంకటాచలపతి, నూర్‌ఆజం, ఎస్.ఎ.కరీముల్లా, ఆర్‌బికె చైర్మన్ కత్తి రాజు, బసినికొండ వైస్ చైర్మన్ బావాజాన్, బీఎ ఖాజా, వైఎస్సార్ సీపీ నాయకులు దండు కరుణాకర్‌రెడ్డి, ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరి రఫీ, నూర్, రహంతుల్లా అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. దీంతోపాటు డ్రైవర్స్ కాలనీ ఈద్గా, ఈద్గా–ఏ–అక్సరీతో పాటు పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని అన్ని మసీదులలోనూ ఈద్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లె, కుక్కరాజుపల్లె, కొటాల, గంగిరెడ్డిపల్లె తదితర పంచాయితీలలో రంజాన్ పండుగను జరుపుకున్నారు.

నిమ్మనపల్లె : మండలంలోని నిమ్మనపల్లె, కొండయ్యగారిపల్లె, రాచవేటివారిపల్లె, సింగంవారిపల్లె, సైదాపేట, చౌకిల్లవారిపల్లె గ్రామాల్లోని ఈద్గా మైదానాల వద్దకు ముస్లింలు తక్బీర్ చదువుతూ, ప్రదర్శనగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రామసముద్రం: మండలంలోని రామసముద్రం, చెంబకూరు, ఆర్.నడింపల్లి, ఎం.గొల్లపల్లి , ఊలపాడు , కెసి.పల్లి , తిరుమలరెడ్డిపల్లి గ్రామాల్లోని ముస్లింలు గురువారం రంజాన్ పండుగ ఘనంగా నిర్వహించారు. దిగువపేట మసీదు నుంచి చెక్‌పోస్ట్ మీదుగా ఈద్గా వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ముతవల్లి సిరాజ్‌బాషా , మత గురువు ఉసామ్, మహబూబ్‌బాషా, మస్తాన్, షంషేర్, మున్వర్‌సాబ్ ఉబేద్ , మత పెద్దలు పాల్గొన్నారు.

ములకలచెరువు: మండలంలోని ములకలచెరువు, సోంపల్లి, చౌడసముద్రం, కాలువపల్లి, పెద్దపాళ్యం, వేపూరికోట, దేవులచెరువు, బురకాయలకోటలోని ముస్లింలు ఈద్గా వద్దకు ఉదయం 9 గంటలకు చేరుకుని ప్రార్థనలు చేశారు. మత గురువులు మాట్లాడుతూ ప్రజలు మంచి మార్గంలో నడవాలని, ఖురాన్ ప్రాముఖ్యతను వివరించారు.

కురబలకోట: కురబలకోట మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రంజాన్ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మసీదులను అందంగా అలంకరించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కేవీపల్లె : మండలంలోని వగళ్ల, లక్ష్మీరెడ్డిగారిపల్లె, గర్నిమిట్ట, మారేళ్ల, నూతనకాల్వ, గుడ్డెడ్డిగారిపల్లె, కేవీపల్లె, గోరంట్లపల్లె, దేవాండ్లపల్లె, జాండ్రపేట, కమ్మపేట, తిమ్మాపురం, తురకపల్లె, గుండ్రేవారిపల్లె తదితర గ్రామాలలో రంజాన్ పండుగను జరుపుకున్నారు. గ్రామ సమీపాల్లోని ఈద్గాల వద్ద మత గురువులను అనుసరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నిసార్ అహ్మద్‌కు రంజాన్ శుభాకాంక్షల వెల్లువ

మదనపల్లె : రంజాన్ పండుగను పురస్కరించుకుని మదనపల్లె వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. గురువారం ఉదయం బెంగళూరురోడ్డులోని ఈద్గామైదానం, బసినికొండ డ్రైవర్స్‌కాలనీలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న నిసార్‌అహ్మద్‌ను పలువురు ఆత్మీయంగా కౌగిలించుకుని ఈద్ ముబారక్ తెలిపారు. తర్వాత జామియా మసీదు సమీపంలోని త్యాగరాజవీధిలోని ఆయన స్వగృహంలో రామసముద్రం , మదనపల్లె, నిమ్మనపల్లె, మదనపల్లె మున్సిపాలిటీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆయనకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించి, ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. నిసార్‌అహ్మద్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మండల కన్వీనర్ దండు కరుణాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులు రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజు, మునిశేఖర్, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు, 9వవార్డు కౌన్సిలర్ పాల్‌చంద్రశేఖర్, పసుపురవి తదితరులు ఉన్నారు.

పీలేరు : పీలేరులో స్థానిక మదనపల్లె మార్గంలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలు స్మశాన వాటికలకు వెళ్లి తమ పూర్వ కుటుంబ సభ్యుల ఆత్మశాంతి కోసం చదివింపులు చేయించారు. మండలంలోని బోడుమల్లువారిపల్లె, తలపుల, రేగళ్లు, శివరామపురం, ఒంటిల్లు తదితర ప్రాంతాల్లో రంజాన్ జరుపుకున్నారు.

కలికిరి: మండలంలో ముస్లిం సోదరులు సైనిక పాఠశాల సమీపంలో నూతనంగా రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఈద్గా నందు ప్రార్థనలకు హాజరయ్యారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ హాజరయ్యారు. పట్టణంలో క్రాస్ రోడ్డు మసీదు ఆవరణలోనూ, మేడికుర్తి, మహల్, గుండ్లూరు, గుట్టపాళెం, పల్లవోలు గ్రామాల్లో ముస్లిం సోదరులు ఆయా ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు.

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి, గండబోయనపల్లె, స్థానిక నిమ్మనపల్లె బస్టాండ్, బండమకానీధిలోని మసీదుల్లో, హసన్‌ఖాన్‌వీధిలోని దర్గాలో, బైపాస్ రోడ్డు, నమాజ్ కట్ట వీధుల్లోని ఈద్గాల వద్ద గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కలకడ : మండలంలోని కలకడ, కోన, నడిమిచెర్ల, ఎర్రకోటపల్లె, ముడియంవారిపల్లె తదితర గ్రామాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ, మర్రిపాడు, చెర్లోపల్లె, సంగసముద్రం, టి.రాచపల్లె, శెట్టివారిపల్లె, అమిలేపల్లే, ఖండ్రిగ గ్రామాల్లో రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని ముస్లింలు గురువారం రంజాన్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కందుకూరు, పీటీఎం, మద్దయ్యగారిపల్లి, పులికల్లు, రంగసముద్రం, చెన్నరాయునిపల్లి తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్దకు ముస్లింలు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు.

బి.కొత్తకోట: స్థానిక పీటీఎంరోడ్డులోని ఈద్‌గాహ్ వద్దకు ముస్లింలు పెద్దసంఖ్యలో ఉదయం ఏడు గంటల నుంచే చేరుకున్నారు. ఈద్ ప్రాముఖ్యత గురించి మతపెద్ద ప్రసంగం తర్వాత ఈదుల్‌ఫితర్ ప్రత్యేక నమాజు చేయించారు. ఈద్‌హా స్థలం సరిపోకపోవడంతో రోడ్డుపైనే నమాజు చేశారు. మండలంలోని శంకరాపురం, బడికాయలపల్లె, హార్సిలీహిల్స్, తుమ్మనంగుట్ట, చీకుచెట్టుపల్లెల్లో పండుగ ప్రత్యేక నమాజు నిర్వహించారు.

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ముస్లింలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజుల ఉపవాస దీక్షల అనంతరం చేసుకున్న ఈదుల్‌ఫితర్ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని అల్లాను ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.

ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

వాల్మీకిపురం: రంజాన్ పర్వదినం ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ముస్లిం మైనార్టీలకు ఆయన రంజాన్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ మహా ప్రవక్త బోధనలు, జీవితం అందరికీ అనుసరణీయమని, ప్రజలు ప్రవక్తల మార్గాన్ని అనుసరించి వారి సుగుణాలను అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితోపాటు నియోజకవర్గ ప్రజలపై అల్లాహ్ అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మైనార్టీ నాయకులు సైఫుల్లా, ఇలియాజ్, అలి అన్సర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురం: ముస్లిం మైనార్టీలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే చింతల



మదనపల్లె సిటీ: ఈద్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి



పీలేరు : ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు



కలికిరి: నూతన ఈద్గా వద్ద ప్రార్థనలు



వాల్మీకిపురం: ఈద్గాలో నమాజు చేస్తున్న ముస్లింలు



కలకడ: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గుర్రంకొండలో ఈద్గా వద్ద ..



పెద్దతిప్పసముద్రం: కందుకూరు ఈద్గా వద్ద ..



తంబళ్లపల్లె: ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు



రామసముద్రం : ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ములకలచెరువు: బురకాయలకోటలో..



కురబలకోట: ముదివేడు ఈద్గా వద్ద..



బి.కొత్తకోట: ప్రత్యేక ప్రార్థనలలో ముస్లింలు

బడుగుల ఆశాజ్యోతి పూలే



సబ్ కలెక్టరేట్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె : స్ఫూర్తిప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అని ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. గురువారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా సబ్ కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నీరుగట్టువారిపల్లె మార్కెట్‌యార్డు ఎదుట పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాలమోహన్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప మాట్లాడారు. బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్‌లో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు కార్యాలయంలో నాయకులు యమలా సుదర్శనం, బీసీ నాయకులు రమేష్ తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పీలేరు : స్థానిక మార్కెట్ యార్డు వద్ద పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ధరణికుమార్, గుండ్లూరు రవీంద్ర, హరినాయక్, ప్రభుతేజ, సురేంద్ర, బలరాం తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: పూలే జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక తరిగొండ రోడ్డులోని ఉర్దూ మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. జేవీవీ అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడారు. ప్రిన్సిపల్ నవమల్లిక పాల్గొన్నారు.

బి.కొత్తకోట: పూలే జయంతి వేడుకలను గురువారం స్థానిక వీకేసీ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో సచిన్, సింగన్న, వెంకటేష్, శీనా, నవీన్, రమణ, గంగులప్ప, శివన్న పాల్గొన్నారు.

ఓట్లు అడిగే నైతిక హక్కు నల్లారి సోదరులకు లేదు

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు నల్లారి సోదరులకు లేదని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తీతవగుంటపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల నుంచి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గానీ, ఆయన సోదరుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి గానీ నియోజకవర్గంలో కనపడట్లేదన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఇటువచ్చి అటు వెళతారని విమర్శించారు. నాయకుడంటే ప్రజలకు సేవ చేసే వారుగా ఉండాలన్నారు. తమ కుటుంబమైనా, నల్లారి కుటుంబమైన సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చినవేనని తెలిపారు. అయితే నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అదృష్టవశాత్తు మూడేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉండగానే వేల కొట్లు అక్రమంగా కూడగట్టుకున్నారని ఆరోపించారు. ఎన్నికల కోసం కిరణ్‌కుమార్‌రెడ్డి వచ్చి రాగానే తన పబ్బం గడపడానికి పెద్దిరెడ్డి కుటుంబంపై లేని పోని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎల్లప్పుడూ ప్రజాసేవకు అంకితమయ్యారన్నారు. ఆలయాలకు, మసీదులకు, చర్చిల అభివృద్ధికి ఎంత డబ్బులు సాయమందించారో ఈ ప్రాంత ప్రజలకు తెలుసునని తెలిపారు. స్థానికులకు అందుబాటులో ఉండి సేవలందించే పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత నల్లారి సోదరులకు లేదని చెప్పారు. ఈ నెల 25న పీలేరులో ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను నామినేషన్ దాఖలు చేయబోతున్నానని తెలిపారు. ఆ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, నాయకులు తిమ్మారెడ్డి, వెంకటరమణ, రాజన్న, గజ్జెల శీన్‌రెడ్డి, వీరకుమార్, రామకొండారెడ్డి, హరిబాబు, రత్నాకర్‌రెడ్డి, రాంప్రసాద్‌నాయుడు, రామకృష్ణ, డాబా బాబు, విజయకుమార్‌రెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వైభవంగా ఊరేగింపు



జ్యోతులకు పూజలు చేస్తున్న భక్తులు



అగ్ని గుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

కలకడ : మండలంలోని కోన శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలలో భాగంగా ఉగాది పర్వదినం మరుసటిరోజు నిర్వహించే అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం తొగటవీరక్షత్రియుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి సింహవాహనంపై అలంకరించిన చాందినీబండిలో శ్రీచౌడేశ్వరిదేవిని గ్రామ పురవీధులలో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు బుధవారం రాత్రినుంచి గురువారం ఉదయం వరకూ అమ్మవారికి ఏటా బోనం సమర్పణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక శివాలయంవద్ద శివునికి దర్శనమిచ్చిన అమ్మవారి జ్యోతులు అగ్ని గుండప్రవేశం చేశాయి. ఉదయం 11 గంటలకు శ్రీచౌడేశ్వరిదేవి తిరిగి ఆలయ ప్రవేశం చేశారు. అమ్మవారి రథంవెంట కోన, తిప్పిగారిపల్లె, గంగిరెడ్డిగారిపల్లె, యల్లంగుడిబండ, గొళ్ళపల్లె, బంగారువాండ్లపల్లె, నడిమిచెర్ల పంచాయతీల నుంచేగాక కర్నాటక, కడప, ప్రొద్దుటూరు, మదనపల్లె, రాయచోటి తదితర గ్రామాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజయ్యారు.

మళ్లీ జగనే సీఎం కావాలి

వాల్మీకిపురం: ప్రజలకు మంచి జరగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయిక్రిష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ రెడ్డి, ఓరుగంటి రమేష్, రవి, మెంబరు శీన, ఫారుఖ్, హర్ష, మోహన్ రెడ్డి, వెంకటరమణ, కిరణ్ కుమార్, కిషోర్ విజయ్, వినోద్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న చింతల సాయిక్రిష్ణారెడ్డి

ముగ్గురికి గాయాలు

మదనపల్లె : ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడిన సంఘటన గురువారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. తాకాటంపల్లెకు చెందిన వేమన్న(55), కృష్ణప్ప (45) ద్విచక్ర వాహనంలో బీరంగి గ్రామానికి బయలుదేరారు. బీరంగికి చెందిన రెడ్డప్ప(28) ద్విచక్ర వాహనంలో వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న వారి ద్విచక్ర వాహనాలు తాకాటంపల్లె సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఈ ముగ్గురు వ్యక్తులు గాయపడగా గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బి.కొత్తకోట పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో..

కలకడ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రాత్రి చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై జరిగింది. కలకడ 108 సిబ్బంది, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ టౌన్‌కు చెందిన అన్వర్‌ఖాన్ కుమారుడు షాదిక్‌అల్లీ తన ఆటోలో ఇంటికి వెళ్తుండగా రాయచోటి నుంచి కలకడ వైపు వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ షాదిక్‌అల్లీని 108లో చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డీజేలు ఉపయోగించరాదు

వాల్మీకిపురం: ఈ నెల 11 నుంచి 21వ తేది వరకు వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడి క్రోధినామ సంవత్సర సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ పులిశేఖర్ ఉభయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేవుడి వాహనాల ఎదుట డీజేలు, స్పీకర్లు, టపాకాయలు ఉపయోగించకూడదని సూచించారు. వాహనాల సమయంలో ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు.